ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శుక్రవారం 21 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 (శుక్రవారం సాయంత్రం) సహర్ 5:00 (శనివారం ఉదయం)

న్యూస్ బాక్స్

సమస్యలు పరిష్కరించాలి

వీర్నపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎగుమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని బంజేరులో నూతన భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గాన్ని సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పర్లపల్లి చిన్నరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎల్లం పెద్దిరాజు, కోశాధికారిగా శంకర్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లారపు అరుణ్ కుమార్, సీఐటీయూ అసిస్టెంట్‌సెక్రటరీ రాజశేఖర్, మాజీ అధ్యక్షుడు ఎడపల్లి రాజేల్లయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుంటుకు నరేందర్, మండల అధ్యక్షుడు భూక్య వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల విజయోత్సవ ర్యాలీ

కోనరావుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్కపేట గ్రామంలో గురువారం ఎంఆర్పీఎస్ నాయకులు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ త్యాగఫలమే ఎస్సీ వర్గీకరణ ఆమోదం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేరెళ్ల శ్రీనివాస్, కొమ్ము రాజశేఖర్, బుర్ర దేవదాస్, కర్రోళ్ల చంద్రయ్య, రాజయ్య, మోహన్, అంజయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయోస్తు..



- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి..
- జిల్లావ్యాప్తంగా 6,768 మంది విద్యార్థులు
- పరీక్షల నిర్వహణకు 461మంది సిబ్బంది
- 36 పరీక్ష కేంద్రాలు.. కేంద్రాల వద్ద 144 సెక్షన్



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. పకడ్బందీగా విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా శుక్రవారం నుంచి పరీక్షలు నిర్వహణకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేశారు. విద్యారంగంలో ఉన్నత చదువులకు విద్యార్థికి తొలిమెట్టుగా పదో తరగతి నిలుస్తుంది. పదవ తరగతిలో విద్యార్థులందరూ మెరుగైన ఫలితాలు పొందే విధంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వార్షిక పరీక్షల కోసం ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను చదివించారు. ఈ సారి గ్రేడింగ్‌లకు బదులు మార్కులనే ఇవ్వనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను చదివించింది. ఈ నెల 21న ప్రారంభమయ్యే పరీక్షలు ఒకేషనల్, సంస్కృతం పరీక్షలు కలిపి ఏప్రిల్ 2వతేది వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు ఎన్నో ఆశలతో విజయం సాధించాలనే తపనతో పరీక్షలకు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రంలో భద్రపరిచిన పరీక్షపత్రాలను ఆయా మండలాల పోలీస్ స్టేషన్లకు పంపించారు. తొలిసారిగా విద్యార్థులకు ఆన్సర్ షీట్లు బుక్‌లెట్ రూపంలో అందించనున్నారు.

● హాజరుకానున్న 6,768 మంది విద్యార్థులు

జిల్లాలో పది పరీక్షలకు 6768 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 3051 మంది, బాలికలు 3717 మంది ఉన్నారు. ఫెయిలైన విద్యార్థులు 14 మంది ఉన్నారు. ఇందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 116 మంది ఉండగా బాలురు 66 మంది, బాలికలు 50 మంది ఉన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3028 మంది విద్యార్థులు ఉండగా బాలురు 1680 మంది, బాలికలు 1348 మంది, మోడల్ స్కూల్‌లో 590 మంది ఉండగా బాలురు 285 మంది, బాలికలు 305 మంది, కేజీబీవీలో 508 మంది బాలికలు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 1452 మంది విద్యార్థులు ఉండగా బాలురు 791, బాలికలు 661 మంది ఉన్నారు. మైనార్టీ వేల్ఫేర్ పాఠశాలలో 74 మంది ఉండగా బాలురు 29. బాలికలు 45మంది ఉన్నారు. తెలంగాణ రెసిడెన్షియల్‌లో 74మంది విద్యార్థుల్లో బాలురు ఒకరు, బాలికలు 73మంది, తెలంగాణ వేల్ఫేర్ రెసిడెన్షియల్‌లో 520మంది ఉండగా బాలురు 78. బాలికలు 442 మంది ఉన్నారు. ట్రైబల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్‌లో బాలికలు 143 మంది ఉన్నారు.

● సీసీ కెమెరాల నిఘా

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. గతంలో పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసినట్లుగానే సీసీ కెమెరాలను ఈసారి కూడా కొనసాగిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా

● విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాల యూనిఫాం వేసుకోకూడదు
- ఓఎంఆర్ షీట్ తమదని ధ్రువీకరించుకున్న తర్వాత పరీక్షలు రాయాలి
- హాల్‌టికెట్ నెంబర్ వేయవద్దు
- సెల్‌ఫోన్లు, క్యాలికులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకవెళ్లవద్దు
- పరీక్ష కేంద్రానికి ఎలాంటి కాగితాలు, జిరాక్స్ పేపర్లు తీసుకవెళ్లవద్దు
- పరీక్షకు ఐదు నిముషాల ఆలస్యం మాత్రమే సడలింపు ఉంటుంది. 9.30కి పరీక్ష ప్రారంభం కానుంది. ఆ ప్రకారం 9.35 నిముషాలకు మాత్రమే అనుమతి ఇస్తారు.
- పరీక్ష కేంద్రంలోకి వెళ్లిన తరువాత 15 నిమిషాలు బార్ కోడ్ షీట్, ఆన్సర్ షీట్ ఎలా నింపాలో ఇన్విజిలేటర్ ద్వారా తెలుసుకోవాలి.
- ఎలాంటి గుర్తింపు వివరాలకు ఆన్సర్ షీట్‌లపై రాయవద్దు

మిగతా 8లో

అన్ని వర్గాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రంగిలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ప్రజా ప్రభుత్వం ధ్యేయం అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అర్హులైన 35మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, అలాగే రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం తెలపడంపై సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిల్లు ప్రవేశపెట్టగా దాన్ని బలపరిచే అవకాశం తనకు వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి పడిపోయేలా చేసింది అన్నారు. రాష్ట్రంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని తద్వారా 25.35లక్షల మంది రైతులకు 20,616 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. రుద్రంగి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సామ మోహన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగ నరసయ్య గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, కొమిరె శంకర్, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, తర్రె లింగం, స్వర్గం పరంధాములు, దాసరి గంగరాజు, గుగ్గిళ్ళ వెంకటేశం, సూర యాదయ్య, గంధం మనోజ్, దయ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులు చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండల పరిషత్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని వేములవాడ రూరల్ మండలానికి 9 లక్షలు విలువ చేసే 23 చెక్కులు, అర్బన్ మండలానికి 5 లక్షల 50 వేలు విలువచేసే 26 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ విజయ ప్రకాష్‌రావు, రూరల్ తహసీల్దార్ ఎండి అబుబాకర్, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు, అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, రూరల్ మండల అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ - ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. రైతులు టోకెన్ పద్ధతిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ జిల్లాలో 2024-25 సీజన్‌లో 2.50లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందనే అంచనా ఉందని, కొనుగోళ్లకు అవసరమైన కేంద్రాల ఏర్పాటు జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. హార్వేస్టర్ల యజమానులతో సమావేశాన్ని నిర్వహించి టోకెన్ పద్ధతిన పంట కోతలు జరిగి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, వీధి లైట్లు, మిగతా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత, జిల్లా అధికారి వసంతలక్ష్మి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన శివకల్యాణోత్సవం

- కన్నుల పండువగా త్రిశూల యాత్ర



త్రిశూలానికి చక్రస్నానం చేయిస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

7

గృహ నిర్మాణాలకు ఇసుక కష్టాలు

- వారానికి ఒక్కరోజే అనుమతులు



నిర్మాణంలో ఉన్న భవనం

8

నర్సింగాపూర్ పాఠశాలలో నమూనా ఎన్నికలు

చందుర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ఎన్నికల్లో పోటీ చేయించి, ఎలక్షన్ నిర్వాహణకు సిబ్బందిని నియమించారు. తదుపరి ఓటర్ స్లిప్‌లను పంచి విద్యార్థులందరిచే ఓట్లు వేయించి, ఓట్లు లెక్కించి, తుది ఫలితాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్. జలంధర్‌రెడ్డి ఉపాధ్యాయులు అనిత, కర్ర శ్రీధర్, భానోత్ రాజు, సంపతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు రూ.10వేల వేతనం చెల్లించాలి..



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

చందుర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పదివేల రూపాయల వేతనం చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు నడిగొట్టు లక్ష్మీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ యాదవ్ అన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని గురువారం ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న మెనూ ఛార్జీలు సరిపోవడం లేద న్నారు. గ్యాస్,వంట సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఎం.విజయ, ఎల్.లక్ష్మీ, కవిత, లావణ్య, లక్ష్మీ, సత్తవ్వ, వెంకటలక్ష్మీ, రేణుక, రజిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి..

బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో సింగిల్ విండో డైరెక్టర్ పొట్లపల్లి సత్యనారాయణ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ వైస్‌ఛైర్మన్ దేవరకొండ తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, ప్యాక్స్ ఛైర్మన్లు బండ నర్సయ్య, రామ్మోహన్ రావు, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మాజీ జెడ్పిటిసి చెన్నమనేని శ్రీకుమార్, ప్రజాప్రతినిధులు గోపు పరశురాములు, శ్రీనివాస్, గంగాధర్, వంశీ, మల్లేశం, గోపాల్ రావు, శివతేజ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేతన్నలపై నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం..

- సీఐటీయూ, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నేతన్నలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత,పవర్‌లూం రంగానికి కేవలం రూ.371 కోట్ల నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ సిరిసిల్ల పట్టణంలోని నేతన్న విగ్రహం ఎదుట గురువారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం నేతన్నలకు ఇచ్చిన వాగ్దానాలు అమలుకావాలంటే బడ్జెట్‌ను సవరించి రూ.2వేల కోట్ల నిధులను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అన్నల్‌దాస్ గణేష్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు నక్క దేవదాస్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, పవర్‌లూం అనుబంధ రంగాల నాయకులు చిందం కమలాకర్, సబ్బని చంద్రకాంత్, బూట్ల వెంకటేశ్వర్లు, గడ్డం రాజశేఖర్, బింగి సంపత్, చింతకింది సుదర్శన్, అడిచెర్ల రాజు, సందుపట్ల పోచమల్లు, ప్రభాకర్, దత్తు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు..

ఎల్లారెడ్డిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌గా సుజాత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన రామచంద్రం కలెక్టరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సుజాతను ఏఎంసీ చైర్ పర్సన్ సబేరాబేగం, ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, రేషన్ డీలర్లు, పలువురు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


● వీర్నపల్లి : వీర్నపల్లి తహసీల్దార్‌గా ముక్తార్‌పాషా గురువారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీనియర్‌అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ మారుతిరెడ్డి బదిలీపై గంభీరావుపేటకు వెళ్లారు.

● కోనరావుపేట : మండల తహసీల్దారుగా బి. వరలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. కోనరావుపేట తహసీల్దార్‌గా పనిచేసిన విజయ ప్రకాష్‌రావు వేములవాడకు బదిలీ కాగా ఆ స్థానంలో వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేసిన బి.వరలక్ష్మిని కోనరావుపేట తహసీల్దారుగా నియమించగా బాధ్యతలు చేపట్టారు.

● వేములవాడ రూరల్ : నూతన తహసీల్దార్‌గా అబుబాకర్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సుజాత బదిలీ అయ్యారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట తహసీల్దార్‌గా మారుతిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఉన్న తహసీల్దార్ భూపతి వేములవాడకు బదిలీపై వెళ్లారు. వీర్నపల్లి తహసీల్దార్‌గా ఉన్న మారుతిరెడ్డి గంభీరావుపేట తహసీల్దార్‌లో బాధ్యతలు తీసుకున్నారు.

గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల ధర్నా



ముస్తాబాద్‌లో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ముస్తాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికులు గురువారం ధర్నా చేశారు. నాలుగు నెలలుగా జీతాలను ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోషరాములు, అబ్రమేని లక్ష్మణ్, రాములు, బాబు, సుధాకర్, బాలెల్లు, నర్సింలు, పలువురు మహిళా కార్మికులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి..



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజబీంకర్ రాజన్న డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో సామాన్యునికి లబ్ధి చేకూరే నిధుల కేటాయింపులు జరగలేదన్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ పడిగెల మానస మాట్లాడుతూ మహిళలకు జీవన భృతి ఇస్తానని అధికారంలోకి వచ్చి మర్చిపోయారని విమర్శించారు. అనంతరం బీఆర్ఎస్ 2025 డైరీని ఆవిష్కరించారు. ప్యాక్స్ వైస్ ఛైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కోడి అంతయ్య, కొయ్యడ రమేష్, కోడం సంధ్యారాణి, సత్యనారాయణ రెడ్డి, అబ్బాడి అనిల్‌రెడ్డి, బండి జగన్, గుండు ప్రేమ్‌కుమార్, నవీన్ రెడ్డి, జగత్, కృష్ణ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు..



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వీర్నపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాయిని చెరువు 9వ ప్యాకేజీ పనులను చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వమే పెండింగ్‌లో పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ పాదయాత్రలు చేపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాములునాయక్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయకుండా 11వ ప్యాకేజీ పనులు పూర్తి చేసి నీళ్లను దారి మళ్లించారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రాయిని చెరువు ఎందుకు నింపలేదని ప్రశ్నించారు. మల్కపేట రిజర్వాయర్, చెరువులు నింపే ప్రయత్నం చేస్తుంటే ఓర్వలేక ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్‌ఛైర్మన్ లెంకెల లక్ష్మణ్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీటి యాదవ్, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి బలవన్మరణం


రాజయ్య (ఫైల్)

పెగడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన కొత్తూరు రాజయ్య (53) అనేవ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం తన కుటుంబంతో కలసి కరీంనగర్‌లో నివసిస్తున్న రాజయ్య బుధవారం మధ్యాహ్నం కరీంనగర్ నుంచి పెగడపల్లికి వచ్చాడు. అనారోగ్యం, మానసిక ఒత్తిడి వల్ల మద్యానికి బానిసైన రాజయ్య పెగడపల్లిలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గొడ్డలితో తల భాగంలో కొట్టుకొని, ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం సమీప బంధువులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి చూసేసరికి రక్తపు మరకలతో ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. మృతుడి కుమారుడు విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు.

థాయ్‌లాండ్‌లో చెల్పూర్‌వాసి మృతి


పుల్ల సృజన్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన పుల్ల సృజన్(33) థాయ్‌లాండ్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ వారం రోజుల క్రితం మృతిచెందాడు. శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి రానుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్ల సృజన్ వృత్తి రీత్యా ఏషియన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉద్యోగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకుగాను కంపెనీ తరఫున థాయ్‌లాండ్‌కు విహారయాత్ర వెళ్లాడు. జనవరి 25న థాయ్‌లాండ్‌లో సృజన్ రోడ్డుప్రమాదంలో గాయపడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తన భర్తను స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల క్షతగాత్రుడి భార్య స్నేహ ఎమ్మెల్యేకు సైతం విన్నవించుకుంది. సృజన్ మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి రానుండటంతో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి. మృతుడికి భార్య స్నేహ, కుమార్తె ఉంది.

మూర్ఛవ్యాధితో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో గురువారం సాయంత్రం జుకంటి స్వామిప్రసాద్(38) అనే వ్యక్తి మూర్ఛవ్యాధితో మృతి చెందాడని ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. కోతిరాంపూర్‌కు చెందిన స్వామిప్రసాద్ కారు డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడని, రెండేళ్లక్రితం అతనిభార్య అనారోగ్యంతో మృతిచెదిందని తెలిపారు. అప్పటినుంచి స్వామిప్రసాద్ మనోవేదనతో మద్యంకు బానిసగా మారాడు. ఇంటికి కూడా రాకుండా ప్రభుత్వ ఆశ్రమంలో ఉండేవాడని మృతుడి సోదరుడు పోలీసు లకు ఇచ్చినఫిర్యాదులో పేర్కొన్నాడు. గురువారంసాయంత్రం స్టేడియంలో ఒక వ్యక్తి చనిపోయాడని సమాచారం అందగా వెళ్లి చూశామని, తమ సోదరుడు స్వామి ప్రసాద్‌గా గుర్తించినట్లు తెలిపారు. మూర్ఛవ్యాధి కారణంగానే మరణించి ఉంటాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ తాపీ మేస్త్రి మృతి


మల్లయ్య(ఫైల్)

మానకొండూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాపూర్ మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన కిన్నెర మల్లయ్య(56) అనే తాపీ మేస్త్రీ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పోరండ్లకు చెందిన మల్లయ్య శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో మేస్త్రీ పనిచేసి ఇంటికి తిరిగి వస్తున్నాడు. మండలంలోని శంషాబాద్ గ్రామశివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేత్రాలు దానం..

తిమ్మాపూర్: కిన్నెర మల్లయ్య నేత్రాలను హైదారాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి కుటుంబ సభులుఉ దానం చేశారు. తన తండ్రి చనిపోయినా మరొకరి జీవితానికి నేత్రాలు ఉపయోగపడాలనే అశయంతో నేత్రాలను దానం చేసినట్లు మృతుడి కుమారుడు అనిల్ పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు, నాయకులు మృతుడి కుటుంబాన్ని అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి అల్కాపురికాలనీకి వెళ్లేదారిలోని మురికి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 41నుంచి 50సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కోతిరాంపూర్ డివిజన్‌లో శానిటరీ జవాన్‌గా పనిచేస్తున్న సుంకరి శ్రీనివాస్ గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో మురికి కాలువలో శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా కుళ్లిపోయిన స్థితిలో ఉందని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. మృతుడిని గుర్తించినవారు వెంటనే కరీంనగర్ ఒకటో ఠాణా ఫోన్ నెం. 8331940591, 8712581999కు సమాచారం అందించాలని కోరారు.

వేములవాడలో ఒకరి మృతదేహం లభ్యం..

వేములవాడ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండల అగ్రహారం గ్రామ శివారులో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు. అగ్రహారం గ్రామశివారులో గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు సుమారు 30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి బ్లూ కలర్ నిక్కర్ ధరించి కుడి కాలికి కడియం కలిగివున్నాడని గుర్తించారు. మృతుడి వివరాలు తెలిసినవాళ్లు వేములవాడ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

తాటిచెట్టుపై నుంచి కిందపడి గీత కార్మికుడికి గాయాలు

వీణవంక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన నల్లగోని కనుకయ్య తాటిచెట్టుపై నుంచి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. కనుకయ్య వృత్తిలో భాగంగా కల్లు గీసేందుకు గురువారం తాటిచెట్టు ఎక్కాడు. ఒక్కసారిగా మోకు జారడంతో కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కనుకయ్య ఎడమకాలుకు, కుడిభుజానికి, కన్నుకు గాయాలయ్యాయి.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో తాళంవేసి ఉన్న ఇంట్లో గురువారం అరతులం బంగారం, 10తులాల వెండి ఆభరణాలు చోరీజరిగినట్లు పోలీసులు, కాలనీ వాసులు తెలిపారు. కాలనీకి చెందిన కటుకం సరోజన బుధవారం ఇంటికి తాళంవేసి స్థానికంగా ఉన్నబంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం సాయంత్రం సరోజనఇంటికి రాగా తాళం పగులగొట్టిఉంది. చోరీజరిగినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనస్థలాన్ని ఎస్ఐశ్రీకాంత్ పరిశీలించారు. బీరువాలో ఉన్న అరతులం బంగారం, 10తులాల వెండి అభరణాలు అపహరణకు గురయినట్లు సరోజన పోలీసులకు పిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కవిత్వమా వర్ధిల్లు



● నేడు ప్రపంచ కవితా దినోత్సవం ● ఈ యేడు శాంతి-ఐక్యత అంశంగా వేడుకలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హృదయ స్పందనకు అక్షరరూపమే కవిత్వం. కవులు, రచయితలు సమాజ సమస్యలను ఎత్తిచూపి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు కవిత్వాన్ని ఆయుధంగా వాడుతారు. సమాజ శ్రేయస్సే కవిత్వం పరమావధి. 1999లో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరిగిన యునెస్కో 30వ సదస్సులో మార్చి 21వ తేదీని ప్రపంచ కవితా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారు. ఈ యేడు శాంతి-ఐక్యత అంశం నినాదంగా వేడుకలు జరుపుకోవాలని యునెస్కో ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా కవితా రచన, పఠన, ప్రచురణ, బోధనా వ్యాసంగంలో చైతన్యం, జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ కవిత్వ ఉద్యమాల స్ఫూర్తిని పదిల పరచడమే కవితా దినోత్సవ లక్ష్యాలు. భాషా భిన్నత్వాల్ని కవితా ప్రచారంతో ఏకం చేసేందుకు ఈ దినోత్సవాన్ని ప్రతి యేటా నిర్వహిస్తుంటారు. అంతరించిపోతున్న భాషలను పునరుద్ధరించి భావితరాలకు అందించడం ఈ దినోత్సవ మరో ఉద్దేశం. కవిత్వలోతులు, అందాలు, పరమావధి తెలిసిన వారు ఇతరుల కవిత్వాన్ని ప్రోత్సహిస్తుంటారు. సాహిత్యంలో పట్టు లేని వారు సైతం కవితలను రాయొచ్చనే అంశాన్ని గుర్తులో ఉంచుకొని సమాజ సమస్యలు ఇతివృత్తంగా అద్భుత కవితలను అందరూ ఆవిష్కరించి ప్రతి ఒక్క సృజనకారుడు స్పందించాల్సిన అవసరం ఉంది. ఇతరులను కవితా రచనా దారుల వైపు నడిపించాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే...



మానవులను అనుసంధానం చేస్తుంది

డాక్టర్ నలిమెల భాస్కర్, బహుభాషావేత్త, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత

కవిత్వం మానవులను అనుసంధానం చేసి, హృదయ మాలిన్యాన్ని ప్రక్షాళన చేసే ప్రక్రియ. ప్రకృతిని, సమాజాన్ని, జీవితాన్ని నిశితంగా పరిశీలిస్తూ చెప్పిన భావోద్వేగపూరిత కవిత్వం కలకాలం నిలుస్తుంది.

హృదయాలను రంజింపజేయాలి...

డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, సాహితీవేత్త, అవధాని

హృదయాలను రంజింపజేసేదే కవిత్వం. అది సామాజిక చైతన్యానికి దోహద పడాలి. కవిత్వంలో భావుకత ముఖ్యం. ప్రజల పక్షాన నిలిచి కవిత్వ సృజన చేస్తే అది చిరకాలం జీవిస్తుంది.





తెలుగు కవిత్వాన్ని కాపాడుకుందాం...

డాక్టర్ మలయశ్రీ, శతాధిక గ్రంథకర, చారిత్రక పరిశోధకుడు

తెలుగు భాషను, కవిత్వాన్ని కాపాడుకోవాలి. భాష లేకపోతే కవిత్వమే లేదు. మనమూ ఉండము. ఉన్నా లేనట్లే.

సాహిత్యంపై అభిమానం పెంచుకోవాలి

కొత్త అనిల్‌కుమార్, రచయిత, తెరసం అధ్యక్షుడు



యువత రోజుకు ఐదారు పేజీలైనా చదువుతూ సాహిత్యంపై అభిమానం పెంచుకోవాలి. ముట్టుకుంటే మట్టి నుంచి, తట్టి చూస్తే గుండె నుంచి, పలకరిస్తే పెదవి లోంచి కవిత్వం వస్తుంది.

ఆటో డ్రైవర్‌ను కవిగా చేసింది..: ఎండీ ఖాలిద్, కవి



ఆటో నడుపుకొని జీవించే నన్ను ఓ కవిగా నిలుపుతోంది కవిత్వమే. కవితలను చదవడం, కవి సమ్మేళనాలకు హాజరుకావడం వల్ల నాలో కవిత్వంపై ప్రేమ పెరిగింది. నా కవిత్వ అంశాలు సమాజ సమస్యలు.

పోక్సో కేసు నిందితుడి అరెస్ట్

● రిమాండ్‌కు తరలింపు

పెగడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమ పేరుతో వేధించి ఆమె మృతికి కారణమైన నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామభద్రునిపల్లి గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన బాస రాము, రంగదామునిపల్లి గ్రామానికిచెందిన బాలుడు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేయగా ఈనెల15న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ 19నఆసుపత్రిలో మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఇరువురిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు బాస రామును గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు.

15 మంది బీఆర్ఎస్ నాయకులపై కేసు

చందుర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన సంఘటనలో 15మందిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ అంజయ్య గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈనెల 16న మండల కేంద్రంలో అనుమతి లేకుండా రాస్తారోకో చేపట్టి సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన సంఘటనలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు, దప్పుల అశోక్, ఏనుగుల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మాందాల అబ్రహం, నాయకులు పెగ్గర్ల రమేష్‌రావు, ముద్రకోళ్ల వెంకటేశం, మాదాసు ప్రసాద్, పులి మనోహర్, ఎండి ఇస్మాయిల్, కొమ్ము రమేష్, పరశురాములతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా రాస్తారోకోలు, దిష్టిబొమ్మలు దహనం చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

23న బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయిలో ఈ నెల 23న కరీంనగర్ కేవీఎల్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ఏర్పాట్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదు వేలకు తగ్గకుండా కార్యకర్తలు, నాయకులు సమావేశానికి రావాలన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకల ఇన్‌చార్జి హరీష్ రావు, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో పార్టీ ఆవిర్భావ సిల్వర్‌జూబ్లీ వేడుకలపై దిశానిర్దేశం చేస్తారని అన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరవుతారని, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, మాజీ కార్పొరేటర్లు ఐలేందర్‌యాదవ్, జంగిలి సాగర్, నాయకులు దిండిగాల మహేశ్, తులా బాలయ్య పాల్గొన్నారు.

ఫీడర్ కాలువల ధ్వంసంపై ఫిర్యాదు

శంకరపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ కాలువల ధ్వంసంపై నీటిపారుదల శాఖ ఈఈకి గురువారం ఫిర్యాదుచేసినట్లు యువజనసమితి రాష్ట్రకార్యదర్శి మోరెగణేష్ తెలిపారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ మండలంలోని మొలంగూర్ గ్రామశివారులో దళితుల ప్రభుత్వసీలింగ్ భూము లను సాగునీరు అందించేఫీడర్ కాలువలను కొందరు రియల్టర్లు ధ్వంసం చేశారన్నారు. మరో కాలువను పూర్తిగా పూడ్చి వేసినట్లు పేర్కొన్నారు. కాలువలు లేకపోవడంతో రైతులకు నేడు సాగు నీరందకభూములు పడావుపడి రైతులు నానా కష్టాలు పడుతున్నారన్నారు. తక్షణమే ఈ విషయంపై క్షేత్రస్థాయిలో తనిఖీచేసి శాఖాపరమైన చర్యలు తీసుకొని కాలులను పునరుద్ధరణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

లోహియా సామాజిక న్యాయ పురస్కారానికి వకుళాభరణం ఎంపిక

హుజూరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు డాక్టర్ లోహియా సామాజిక న్యాయపురస్కారానికి ఎంపిక య్యారు. ఈనెల23న న్యూఢిల్లీలోని రాజా రాంమోహన్ రాయ్ మెమోరియల్ హాల్‌లో ఈపురస్కారాన్ని కృష్ణమోహన్‌రావు అందుకో నున్నారు. కృష్ణమోహన్‌రావు రెండుసార్లు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌గా బీసీ హక్కుల పరిరక్షణ కోసం, వెనుకబడిన వర్గాల అభ్యు న్నతికి కృషిచేసి నందుకుగాను ఈ పుర స్కారం అందజేయనున్నారు. ఈ పురస్కారం రావడంపై పట్టణంలోని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మెదక్‌లో అనుపురం దొంగ స్వామి అరెస్ట్

● వేములవాడ మండలంలో కలకలం..

వేములవాడ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన దొంగ స్వామి అరెస్ట్ కావడం స్థానికంగా కలకల సృష్టించింది. మెదక్ ఎస్పీ డి ఉదయ్‌కుమార్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన బుడగ జంగం బొమ్మెర బాపుస్వామి అలియాస్ శివస్వామి జ్యోతిష్యం చెబుతూ ఆరోగ్యం మెరుగు పేరిట పలు పూజలు చేస్తుండేవాడు. మెదక్ జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో తిరుగుతూ వేములవాడకు చెందిన జ్యోతిష్యం శివస్వామి పేరిట విజిటింగ్ కార్డు పంచుతూ సంచరిస్తున్నాడని, అతను నిమ్మకాయ, పసుపు, కుంకుమ వాసనలు చూపిస్తూ నీటిలో నిద్ర మాత్రలు కలిపి తాగించేవాడని, సదరు మహిళ స్పృహ కోల్పోయిన తర్వాత ఆమెపై అఘాయిత్యానికి పాల్పడి మొబైల్‌లో వీడియోలు తీసేవాడు. కొన్ని రోజుల తర్వాత మహిళలకు ఫోన్‌చేసి వీడియోలు ఉన్న విషయం చెప్పి బ్లాక్ మెయిల్ చేసేవాడు. మహిళల ఆర్థిక స్తోమతను బట్టి వేల నుంచి లక్షలు డిమాండ్ చేసి వసూల్ చేశాడు. ఇతర జిల్లాల్లో కూడా ఇదే విధంగా జ్యోతిష్యం పేరుతో వసూలు చేసిన చరిత్ర స్వామికి ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. బాపుస్వామి చేస్తున్న బ్లాక్ మెయిల్ వ్యవహారంపై బాధితుల నుంచి పోలీసులకు సమాచారం రావడంతో నిఘా పెట్టి నర్సాపూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ జరిపి అతడి మొబైల్ ఫోన్‌లో మహిళల వీడియోలు, బ్లాక్ మెయిల్‌చేసి వసూల్ చేసిన ఆన్‌లైన్ వివరాలను పోలీసులు గుర్తించారు. అతడి వద్ద మంత్రాలకు సంబంధించిన సామగ్రి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

వంట చెరుకు పేరుతో టేకు కలప తరలింపు

● రూ.20వేల జరిమానా విధించిన అటవీ అధికారులు

మల్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం ఓబులాపూర్ అటవీ ప్రాంతం నుంచి వంట చెరుకు మాటున టేకు కలపను ట్రాక్టర్‌లో తరలిస్తున్న వ్యక్తికి అటవీ అధికారులు బుధవారం రూ.20 వేల జరిమానా విధించారు. మూడు రోజుల క్రితం టేకు కలపను ట్రాక్టర్‌లో తరలించినట్లు కొందరు అటవీ అధికారులకు ఫిర్యాదు చేయగా సంబంధిత వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేసి కలపను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. టేకు కలప నరికివేతపై పలువురు జిల్లా అటవీ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లి స్థానిక అటవీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కలప తరలింపు విషయమై ఫారెస్ట్ సెక్షన్ అధికారి రత్నమ్మను వివరణ కోరగా కలప రవాణాపై వచ్చిన ఫిర్యాదు మేరకు తాము పట్టుకొని పరిశీలించామన్నారు. వంట చెరుకులో నాలుగు టేకు దుంగలు లభించడంతో జరిమాన విధించినట్లు ఆమె తెలిపారు.

మండుటెండల్లో మత్తడి దూకుతున్న చెక్‌డ్యాం

వీణవంక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండు టెండల్లోనూ వీణవంక చెక్ డ్యాం మత్తడి దూకు తూ చూపరులకు కనువిందు చేస్తోంది. ఎక్కడ చూసినా మండుటెండలకు చేలన్నీ ఎండిపోతుండగా వీణవంక చెక్‌డ్యాం మత్తడి దూకుతూ ఆశ్చర్యం కలిగిస్తోంది. వాగులో పూర్తిస్థాయిలో నీరుపారడంతో పరిసర గ్రామాల్లో భూగర్భ జలా లు పెరిగాయి. ఈ వేసవిలో సాగు నీటి ఎద్దడి తీరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సీసీ రోడ్డు పనులు అడ్డగింత


అధికారులతో మాట్లాడుతున్న చంద్రయ్య

శంకరపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాల్‌పూర్ గ్రామంలో సీసీరోడ్డు పనులను వడ్లకొండ చంద్రయ్య కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. తమభూమి కొంతభాగం సీసీ రోడ్డు కిందపోతుందని అడ్డుకోవడంతో గురువారం తహసీల్దార్ భాస్కర్, ఎస్ఐ రవి, ఆర్ఐ ప్రత్యూష సంఘటన స్థలానికి చేరుకొని మాట్లాడారు. కాగా ఇటీవల పనులు అడ్డుకోవడంతో రెవెన్యూ అధికారులు సర్వేచేయగా ప్రభుత్వభూమి అదనంగా ఉన్నట్లు తేలింది. దీంతో ఆగిపోయిన సీసీరోడ్డు పనులను చేపట్టేందుకు సిద్ధమవు తుండగా చంద్రయ్య కుటుంబం మళ్లీ అడ్డుకోవడంతో అధికారులు సంఘటన స్థలానికిచేరుకొని వారితో మాట్లాడారు. వారిని సముదాయించినా వినకపోవడంతో శుక్రవారం గ్రామసభ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి అనూషను తహసీల్దార్ భాస్కర్ ఆదేశించారు.

మోడల్ స్కూల్‌లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

చిగురుమామిడి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండ లంలోని ముల్కనూర్‌లో గురువారం పిచ్చుకల దినో త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్, పోస్టర్‌మేకింగ్, వక్తృత్వపోటీలు నిర్వహిం చారు. సైన్స్ ఉపాధ్యాయుల మాట్లాడుతూ పిచ్చుకల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందన్నారు. ప్రకృతిలోని ప్రతిజీవియొక్క ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఒకజీవి మరొకజీవిపై ఆధారపడి ఉంటుందని, ఆహార సమతుల్యత పాటించాలన్నారు. మూగజీవాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

గేట్‌లో కరీంనగర్ విద్యార్థి ప్రతిభ

● జాతీయ స్థాయిలో 60వ ర్యాంకు సాధించిన హర్షిత్‌రెడ్డి



కరీంనగర్ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్-2025లో కరీంనగర్‌కు చెందిన శీలం హర్షిత్‌రెడ్డి ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 60వ ర్యాంకు సాధించాడు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన హర్షిత్‌రెడ్డి తండ్రి మధుకర్‌రెడ్డి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ కరీంనగర్‌లోని మెహర్‌నగర్‌లో నివాస ముంటున్నారు. హర్షిత్‌రెడ్డి తల్లి మంగశ్రీ గృహిణి. చిన్ననాటి నుంచి చదువులో రాణిస్తున్న హర్షిత్‌రెడ్డి కరీంనగర్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్ జేఎన్టీయూలో బీటెక్ (సీఎస్‌సీ) ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత యేడాది గేట్‌లో జాతీయస్థాయిలో 776వ ర్యాంకు సాధించాడు. మరింత మెరుగైన ర్యాంకు సాధించాలనే పట్టుదలతో చదివిన హర్షిత్‌రెడ్డి బుధవారం ప్రకటించిన గేట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 60వ ర్యాంకు సాధించాడు. దేశంలో ప్రముఖ ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హర్షిత్‌రెడ్డిని తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు.

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనతో

దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

గోదావరిఖని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన సీపీఐ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయనముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో జమిలి ఎన్నికలు తీసుకురావడం ద్వారా సమైక్య స్ఫూర్తికి విఘాతం కలిగించే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. జమిలి ఎన్నికల విధానాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గి ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. ఇదే జరిగితే కేంద్ర ప్రభుత్వంపై ఉత్తరాది రాష్ట్రాల ఆజమాయిషీ పెరిగి దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. ఏడు లక్షల కోట్లు అప్పు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టి సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేయడం శుభసూచకమన్నారు. దేశంలో నక్సలిజాన్ని, కమ్యూనిస్టులను రూపుమాపడానికి మోదీ, అమిత్‌షా అవలంబిస్తున్న నిరంకుశ విధానం సరైంది కాదని చాడ విమర్శించారు. ప్రస్తుతం విజ్ఞానాన్ని మంచివైపు ఉపయోగించకుండా దేశంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ చేస్తున్న అరాచకాలను ప్రశ్నిస్తున్న అభ్యుదయవాదులను, కమ్యూనిస్టులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడాన్ని హర్షిస్తున్నామని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ కేటాయించి, వారికి బడ్జెట్ కేటాయింపులు జరుగకపోవడం వల్ల ఒరిగేదేమీ ఉండదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కలవేన శంకర్, తాండ్ర సదానందం, కనకరాజు, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, తాళ్లపల్లి మల్లయ్య, ఓదమ్మ, స్వామి, శంకర్, రమ, రాజరత్నం, మార్కపురి సూర్య, కుమార్, రేణికుంట్ల ప్రీతం పాల్గొన్నారు.

ప్రపంచ సుందరికి అగ్గిపెట్టలో అమిరే చీర



ప్రపంచ సుందరి క్రిస్టినాకు అగ్గిపెట్టెలో అమిరే చీరను అందజేస్తున్న హరిప్రసాద్

సిరిసిల్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో మేలో జరిగే 2025 ప్రపంచ సుందరి పోటీలకు వచ్చిన 2024 ప్రపంచ సుందరి క్రిస్టినాను సిరిసిల్ల నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్ సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో మిస్ వరల్డ్‌ను సన్మానించడంతో పాటు తాను తయారు చేసిన అగ్గిపెట్టెలో అమిరే చీర ను ఆమెకు అందజేశారు. ఈ సందర్భం గా క్రిస్టినా హరిప్రసాద్ తయారు చేసిన చీరను చూసి ఆశ్చర్యపోయి అభినందించారు. అగ్గిపెట్టెలో అమిరే చీరను తన భుజాలపై వేసుకొని ఫొటోలకు ఫోజులు ఇచ్చారు.

అడవులతోనే మనుగడ



- అంతరించి పోతున్న వన సంపద
- ఆహారం, నీటి కోసం జనారణ్యంలోకి వన్యప్రాణులు
- కరీంనగర్ జిల్లాలో 427 హెక్టార్ల అటవీ ప్రాంతం
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

కరీంనగర్ క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రాణుల మనుగడకు దోహదపడే అడవులు జీవ వైవిధ్యంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. పక్షులు, జంతువులు, వివిధ రకాల కీటకాలకు ఆవాసాలుగా మారిన అడవులు అంతరించిపోతే అనర్థాలు జరిగే అవకాశాలున్నాయి. అందుకే ప్రాణకోటికి ఆవాసాలుగా ఉన్న అడవుల రక్షణ అత్యంత అవసరం. అడవుల సమతుల్యత లోపిస్తే వాటిపై ఆధారపడి జీవించే ప్రాణులపై ప్రభావం పడుతుంది. భూమిపై అడవులే లేకపోతే... సకల జీవరాశి లేదు. ప్రాజెక్టుల నిర్మా ణం, రోడ్లు, ఇళ్ల నిర్మాణం వంటి కారణాలతో అడవులు నానాటికి అంత రించిపోతున్నాయి. మానవ మనుగడకు అవసరమైన అడవులను కాపా డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఆహార భద్రత, పోషణ, జీవనోపాధిలో అడవులు కీలక పాత్రను పోషిస్తున్నాయి. ఆహారం, ఇంధనం, ఉపాధిని అందించడంతో పాటు అడవులు నేల సారాన్ని పెంచుతాయి. నీటి వనరులను కాపాడుతాయి. కీలకమైన పరాగసంపర్కాలతో సహా జీవ వైవిధ్యానికి అడవులు ఆలవాలంగా నిలుస్తాయి. అడవులు కార్బన్‌ను నిలువచేయడం ద్వారా వాతావరణ మార్పుల సమస్థితికి దోహదం చేస్తాయి.

● అంతంతమాత్రంగా సంరక్షణ చర్యలు

ఉమ్మడి జిల్లా ఉన్న సమయంలో కరీంనగర్‌లోనే తూర్పు, పశ్చిమ అటవీ డివిజన్‌లు విభజించి రెండు డివిజన్లకు వేర్వేరుగా అటవీశాఖ అధికారులు (డీఎఫ్‌వో) ఉండేవారు. జిల్లాల విభజనతో నాలుగు జిల్లాల్లో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాకు కలిపి ఒకే డీఎఫ్‌వో ఉండగా పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు వేర్వేరు డీఎఫ్‌వోలను నియమించారు. కరీంనగర్ జిల్లాలో అటవీ ప్రాంతం సైదాపూర్, గంగాధర మండలాల్లో మాత్రమే ఉంది. చొప్పదండి మండలంలో కొంత అటవీ ప్రాంతాన్ని పెంచుతున్నారు. జిల్లాలో చాలా తక్కువ విస్తీర్ణంలో అడవులున్నాయి. అటవీ ప్రాంతంలో కొత్తగా మొక్కలు నాటే కార్యక్రమం అంతంత మాత్రంగానే నిర్వహిస్తుండడం, ఇష్టానుసారంగా చెట్లను నరికి వేస్తుండటంతో పర్యావరణ సమస్య తలెత్తుతున్నది. వన్యప్రాణుల వేట ఇష్టానుసారంగా కొనసాగుతుండటంతో అరుదైన కొన్ని జంతువులు, పక్షుల జాతి అంతరించే ప్రమాదం పొంచి ఉన్నది.

● హుజూరాబాద్ ఫారెస్ట్ డివిజన్‌లో 173.247 హెక్టార్లు ఫారెస్టు ఉండగా రాయికల్ ప్రాంతంలోనే ఈ అటవీ ప్రాంతం ఉంది. జిల్లా భూమి విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 33 శాతం ఉండాలి. కానీ జిల్లాలో 10 శాతంలోపే అటవీ ప్రాంతం ఉంది. రోడ్ల పక్కన, ఇళ్లల్లో, సీటీసీ మియావాకి, ఇతర ప్రాంతాల్లో ఉన్న చెట్లతో కలిపి ఓవరాల్‌గా జిల్లాలో గ్రీన్‌కవర్ మాత్రం 15 శాతం వరకు ఉంది.

అటవీ దినోత్సవ నేపథ్యం

అడవుల ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2012లో మార్చి 21న అటవీ దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానం చేసింది. 2013 మార్చి 21న మొదటి అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. అటవీ దినోత్సవం సందర్భంగా అడవులు, చెట్ల ప్రాధాన్యం, మానవ మనుగడలో అడవుల పాత్రపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తారు. అడువులను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తారు.

● జనావాసాల్లోకి వన్యప్రాణులు



అటవీ ప్రాంత విస్తీర్ణం తగ్గిపోవడంతో అటవీ జంతువులకు సహజసిద్ధంగా లభించే ఆహారం దొరకకుండా పోతున్నది. ఇంకో వైపు అడవి పందులు, కుందేళ్లు, ఉడుములు, నెమళ్లు వంటి వణ్యప్రాణుల వేట కొనసాగుతున్నది. దీనికి తోడు మండే ఎండలతో అటవీ ప్రాంతంలో నివసించే వన్యప్రాణులకు తాగునీరు లభించని పరిస్థితి నెలకొన్నది. తాగునీరు, ఆహారం వెదుక్కుంటూ ఎలుగుబంట్లు, జింకలు, నెమళ్లు, కోతులు, దుప్పి, మనుబోతు, హైనా, ఇతర జంతువులు అభయారణ్యం వదిలి జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే కొన్ని జంతువులు వేటగాళ్ల బారినపడుతుండగా మరి కొన్ని జంతువులు ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి.



అడవుల రక్షణకు చర్యలు

కరీంనగర్ జిల్లాలో 429.772 హెక్టార్ల పరిధిలో అటవీ విస్తీర్ణం ఉంది. ఇందులో కరీంనగర్ ఫారెస్టు డివిజన్‌లో 256.525 హెక్టార్లు అటవీ ప్రాంతం ఉండగా ఇందులో గంగాధర మండలం వెంకటాయపల్లి, కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వాగు ప్రాంతంలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అటవీశాఖ భూమి కోల్పోగా దానికి బదులుగా చొప్పదండి మండలం వెదురుగట్ట గ్రామంలోని బోడిగుట్ట ప్రాంతం 400 హెక్టార్లను కొంత కాలం కిందట అటవీ శాఖకు అప్పగించారు. ఈ బోడిగుట్ట ప్రాంతంలో పెద్ద ఎత్తున మొక్కలను అటవీ శాఖ పెంచుతున్నది. కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లలో అటవీశాఖకు ఇచ్చిన 17.34 హెక్టార్ల భూమిలో ఇరుకుల్ల వాగు 14 హెక్టార్ల వరకు ఉంది. అయినప్పటికీ ఈ ప్రాంతాన్ని అడవిగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ సిద్ధమవుతుండగా సరిహద్దు నిర్ణయించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇంత వరకు హద్దులను ఏర్పాటు చేయనందున ఇక్కడ మొక్కలు పెంచేందుకు వీలులేకుండా పోతున్నది.

1952 వైల్డ్ లైఫ్ యాక్ట్(ప్రొటెక్షన్) కింద కేసులు:

కరీంనగర్ జిల్లాలో గడిచిన ఏడాదిలో వైల్డ్‌లైఫ్ యాక్ట్ కింద ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో నిందితులకు జరిమానా విధించారు.

● ఏడాదిలో కరీంనగర్ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి విలువైన టేకు, ఇతర కలపను అక్రమంగా తరలిస్తున్న, అనుమతి లేకుండా చెట్లను నరకివేయటంలపై 100 వరకు కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి దాదాపు 40 లక్షల రూపాయల జరిమానా వసూలు చేశారు.

కరీంనగర్, జగిత్యాలలో ఐటీ సోదాలు

● వారధి సొసైటీ, ఆర్డీవో కార్యాలయంలో రికార్డుల తనిఖీలు

● టీడీఎస్ కటింగ్‌లో అవకతవకలపై రికార్డుల పరిశీలన

కరీంనగర్ క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉమ్మడిజిల్లాలో గురువారం హైదరాబాద్‌కు చెందిన ఆదాయపు పన్నుశాఖ అధికారులతో కూడిన నాలుగు బృందాలు రెండుచోట్ల సోదాలు నిర్వహించాయి. కరీంనగర్‌లోని పద్మనగర్‌లో ఉన్న వారధి సొసైటీలో, జగిత్యాల ఆర్‌డీఓ కార్యాలయంలో ఐటీ అధికారుల బృందాలు సోదాలు నిర్వహించాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాల కోసం ఔట్‌సోర్సింగ్ ద్వారా ఎంపిక, వేతనాల చెల్లింపు వారధి సొసైటీ ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ లావాదేవీలలో టీడీఎస్ కటింగ్‌లో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లుగా ఆదాయపన్నుశాఖ హైదరాబాద్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. అలాగే జగిత్యాలలో రైల్వేప్రాజెక్టు కోసం భూసేకరణలో ఆర్‌డీఓ కార్యాలయం ద్వారా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపుల లావాదేవీలలో టీడీఎస్ కటింగ్‌లలో భారీ మొత్తంలో అవకతవకలు జరిగినట్లు ఐటీశాఖకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారుల బృందాలు రెండు చోట్ల తనిఖీలు నిర్వహించాయి. రికార్డులను తనిఖీ చేసి టీడీఎస్ కటింగ్‌లో జరిగిన అవకతవకలను గుర్తించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన కొన్ని రికార్డులను కూడా ఐటీ అధికారులు స్వాధీ నం చేసుకున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా కరీంనగర్ ఐటీ అధికారులకు తెలియకుండా హైదరాబాద్ నుంచి నాలుగు బృందాలు వచ్చి కరీంనగర్, జగిత్యాలలోని రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించటం గమనార్హం.

● ఆర్డీవో కార్యాలయంలో పలువురి విచారణ

జగిత్యాల అర్బన్: జగిత్యాల జిల్లాలో 2019 రైల్వే భూసేకరణలో ప్రభుత్వం చెల్లించిన సొమ్ముకు సంబంధించి పలు అక్రమాలపై జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో ఐటీ అధికారులు గురువారం రాత్రి వరకు తనిఖీలు నిర్వహించారు. లింగంపేట నించి అంతర్గాం, అంబారిపేట నుంచి ముందుకు విస్తరించిన రైల్వే ట్రాక్ నిర్మాణంలో నష్ట పరిహారం విషయంలో కోట్లాది రూపాయల గోల్‌మాల్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు జగిత్యాల ఆర్డీఓ కార్యాలయంలో అప్పుడు ఉన్న చార్టర్డ్ అకౌంటెంట్‌ను పిలిచి గురువారం రాత్రి పొద్దు పోయేవరకు విచారించారు. అక్రమాలకు పాల్పడిన కొందరు రైతులను, అందుకు ఉపయోగించిన పాన్ కార్డుల వివరాలను అధికారులు పరిశీలించారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం

● విడతల వారీగా విద్యుత్ వినియోగానికి రైతుల నిర్ణయం



గొర్రెగుండంలో తాళం వేసి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మల్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోవోల్టేజీతో పంటలకు సాగు నీరందడం లేదని, పంటలను కాపాడుకోవడానికి పంప్‌సెట్లకు విడతల వారీగా విద్యుత్ సరఫరా అయ్యేలా రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసుకుంటున్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం గొర్రె గుండం గ్రామంలో వ్యవసాయ వినియోగం కోసం 100 కేవీల సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద 90హెచ్‌పీల సామర్థ్యం వరకు పంప్‌సెట్లు వినియోగిస్తున్నారు. కొన్ని అనధికార కనెక్షన్లతో నెల రోజులుగా లోవోల్టేజీతో పంప్‌సెట్లు కాలిపోతున్నాయి. చివరి దశలో ఉన్న వరి పంటలకు, మామిడి ఇతరత్రా పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం రైతులు పలు మార్లు అధికారు లు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులే ఓ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ ఫీడర్‌కు 22 రోజులుగా తాళం వేసి రాత్రి సమయంలో కొన్నింటికి, పగటి పూట మరికొన్ని మోటార్లకు విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తున్నారు. ఇంతుకు ఒక వ్యక్తిని నియమించారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ తగ్గింది.

●మల్యాల ట్రాన్స్‌కో ఏడీఈ మహేందర్‌ను వివరణ కోరగా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు 30 వరకు పంప్‌సెట్ కనెక్షన్లు ఉండగా మరో 12 వరకు అనధికార మోటార్లను వినియోగిస్తున్నారన్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పడి లోవోల్టేజీ సమస్య ఏర్పడుతుందన్నారు. ఇటీవల రైతులు కనెక్షన్ల కోసం డీడీలు చెల్లించడంతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మాజీమేయర్ సునీల్‌రావు కుమారుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో కారు నడిపి డివైడర్‌ను ఢీకొట్టిన మాజీమేయర్ కుమారుడిపై కేసున మోదైంది. మాజీమేయర్ సునీల్‌రావు కుమారుడు వై ప్రద్యుమ్ హైదరాబాద్‌లోని అల్వాల్‌లో నివాసముంటూ చదువుకుంటున్నాడు. ఈ నెల19న స్నేహితులు ఎస్ యశ్వంత్‌రెడ్డి, కార్తీక్‌రాజ్‌తో కలిసి మాదాపూర్‌కు కారులో వచ్చాడు. అక్కడ మద్యం తాగి కారులో బయలుదేరారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 10కి వచ్చేసరికి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.బెలూన్‌లు తెరుచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని శ్వాసపరీక్ష చేయగా ప్రద్యుమ్‌కు బ్లడ్ అల్కహాల్ కౌంట్(బీఏసీ) 38 వచ్చింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అనుమతిలేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని బుగ్గరాజేశ్వరతండా శివారులో పట్టుకున్నామని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. వాహనతనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఎదురుపడిందని, తనిఖీచేయగా రవాణాకు అనుమతి పత్రాలు లేకపోవడం వల్ల వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని అజ్మీరా మోహన్‌పై కేసు నమోదు చేశామన్నారు.

చెక్‌బౌన్స్ కేసుపై కర్ణాటక పోలీసుల విచారణ

కరీంనగర్‌క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బెంగుళూరుకు చెందిన ఓవ్యక్తికి ఇచ్చిన చెక్కుబౌన్స్ కేసులో నిందితుడిగా ఉన్న ఎంఐఎం కరీంనగర్ శాఖ అధ్యక్షుడు గులాం అహ్మద్‌కు నాన్‌బెయిలబుల్ వారంట్ (ఎన్‌బీడబ్ల్యు)జారీ చేసేందుకు కర్ణాటక పోలీసులు గురువారం కరీంనగర్‌కు వచ్చారు. గులాం అహ్మద్ ఇంటికిచేరుకున్న కర్ణాటక పోలీసులు గంటపాటు కుటుంబసభ్యులతో మాట్లాడినట్లు సమాచారం. ఫిర్యాదు దారుడిని వెంట బెట్టుకుని వచ్చిన పోలీసులు ఎన్‌బీడబ్ల్యు జారీచేసేందుకు ప్రయత్నించగా గులాం అహ్మద్ ఇంటిలో లేరనితెలిసింది. దీనిపై స్థానిక పోలీసులను అడగగా చెక్‌బౌన్స్ కేసులో కర్ణాటకపోలీసులు గులాంఅహ్మద్ ఇంటికి వచ్చినట్లు తెలిపారు.

ముగిసిన శివ కల్యాణోత్సవం





నాకబలి పూజలో పాల్గొన్న భక్తులు, అద్దాల మండపంలో నాకబలి నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన శివకల్యాణోత్సవం గురువారం ముగిసింది. ఆలయ అర్చకులు ఉదయం 6.30 గంటలకు తీర్థరాజ స్వామి పూజ, ఔపాసనం-బలిహరణం ఘనంగా నిర్వహించారు.

శేషహోమాలు జయాదులు, పూర్ణహుతి, యాగ మండప దేవతోత్వాసనాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జంగమ పూజారులు శరభ గజ్జల కార్యక్రమాన్ని, పల్లకీ సేవను నిర్వహించారు. ఉదయం అద్దాల మండపంలో నాకబలి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గుమ్మడికాయలను కత్తితో కొట్టారు. అనంతరం త్రిశూల యాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు త్రిశూలానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి స్వామివారి ధర్మగుండంలో చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కాగా, హోమం కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ పాల్గొన్నారు.

ఐదుగురు ఎస్‌ఐల బదిలీ

కరీంనగర్ క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. కరీంనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ మామిడాల సురేందర్‌ను చొప్పదండికి, స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ బి వంశీకృష్ణను గంగాధరకు, గంగాధర ఎస్‌ఐ జి నరేందర్‌రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ రాజును రామడుగుకు, రామడుగు ఎస్‌ఐ శేఖర్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు సీపీ గౌస్ ఆలం ఉత్తర్వులు జారీ చేశారు.

కళాకారుల బృందానికి అభినందన

గణేష్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కళాకారులను ఎస్‌ఈ మేక రమేష్ బాబు గురువారం అభినందించారు. విద్యుత్ శాఖ కల్చరల్ పోటీల్లో కరీంనగర్ కళాకారులు ప్రదర్శించిన స్వప్నం రాల్చిన అమృతం నాటికకు ఉత్తమ బహుమతి వచ్చింది. సాంస్కృతిక విభాగంలో కె ఆనంద్, జానపద గేయాల విభాగంలో మధుకర్, ఫ్యాన్సీ డ్రెస్ విభాగంలో సరళకుమారి, మ్యాజిక్‌లో వేణుగోపాల్ మొదటి బహుమతి సాధించారు. కార్యక్రమంలో రంగు వెంకటనారాయణ, ఆనంద్, సరళకుమారి, ఎస్ఏవో రాజేంద్రప్రసాద్, డివిజనల్ ఇంజనీర్ రాజారమణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా యోగ నారసింహుడి ఏకాంతోత్సవం



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు



స్వామివారికి ప్రత్యేక పూజలు

ధర్మపురి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి (యోగ) ఏకాంతోత్సవం గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషప్ప కళావేదికపై ధర్మపురికి చెందిన ఎస్ శివాని బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. మద్వాచారి పవన్‌కుమార్ బృందం పేరిణి శివతాండవం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి 7 గంటలకు ఉగ్ర నారసింహ (కొత్త) స్వామి పుష్పయాగం, రాత్రి 9 గంటలకు వేంకటేశ్వర స్వామి ఏకాంతోత్సవం ఉంటుంది. శేషప్ప కళావేదికపై సాయంత్రం 6-30 నుంచి 7-30 వరకు గోదావరిఖనికి చెందిన డాక్టర్ జ్యోతిరంగ బృందం కూడిపూడి నృత్య ప్రదర్శనలు, 7-30నుంచి రాత్రి 9 వరకు కరీంనగర్‌కు చెందిన సుహాసిని బృందం వారిచే నృత్య ప్రదర్శనలు ఉంటాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. హుండీ లెక్కింపు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం అవుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించేందుకు ఏర్పాట్లు..

- రాజయ్య, ఏపీవో, చందుర్తి



ఆంధ్రజ్యోతి : మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద ఎన్ని పని దినాలు చేయాల్సి ఉంది?

ఏపీవో : ఉపాధిహామీ పథకం 2025-26 సంవత్సరానికి లేబర్ బడ్జెట్ 2,40,000 పని దినాలు చెయ్యవలసి ఉంటుంది. అన్ని గ్రామాల్లో పనులు చెయ్యడానికి పనులు సిద్ధం చేస్తున్నాం. 1 ఏప్రిల్ నుంచి గ్రామాల్లో పనులు ప్రారంభమవుతాయి.

ఆంధ్రజ్యోతి : మండ లంలో ఉపాధిహామీ కూ లీలకు ఎన్ని జాబ్ కార్డు ఉన్నాయి?

ఏపీవో : మాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూ లీలకు మొత్తం 7933 జాబ్ కార్డులు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : ప్రతిరోజు ఉపాధిహామీ పనులకు ఎంత మంది కూలీ లు హాజరవుతున్నారు?

ఏపీవో : ఉపాధిహామీ పనులకు ప్రతిరోజు 810మంది కూలీలు హాజరవుతున్నారు.

ఆంధ్రజ్యోతి : ఎన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి?

ఏపీవో : మండలంలోని 19 గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి.

- చందుర్తి(ఆంధ్రజ్యోతి)

అవగాహన కల్పించాలి

ఇల్లంతకుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల వల్ల కలిగే చెడు ఫలితాలపై అవగాహన కల్పించాలని యాంటీనార్కోటిక్ సీఐ కృష్ణమూర్తి సూచించారు. మండలకేంద్రంలోని వేదశ్రీ డిగ్రీ కళాశాలలో గురువారం సమావేశం అయ్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు యాంటీడ్రగ్స్‌పై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. వ్యసనాలకు బానిసలుగా మారడం ద్వారా జీవితాలు పాడవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బత్తిని ఆంజనేయులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

చివరికి ఎన్ని కష్టాలో..!

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వరి పంటను కాపాడుకునేందుకు రైతుల తంటాలు



నిమ్మపల్లిలో ట్యాంకర్ ద్వారా పొలానికి నీరందిస్తున్న రైతు

కోనరావుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పంటలు కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భజలాలు అడుగంటుతుండడంతో పొట్టకు వచ్చిన వరి ఎండిపోతోంది. ట్యాంకర్ల ద్వారా నిరందిస్తూ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ వరి పంట ఎండిపోవడంతో వరి సాగు కన్నీటి సేద్యంగా మారింది. కోనరావుపేట మండలంలో 17,800 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. కోనరావుపేట మండలం మెట్ట ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు అడుగంటి రైతుల పొలాలు ఎండిపోతున్నాయి. ఉన్న కొద్దిపాటి నీటితో పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా రెండు ఎకరాలు సాగు చేసిన రైతుకు ఒక్క ఎకరం మాత్రమే పారుతోంది. పెట్టుబడి రావడం కూడా కష్టంగా మారింది. నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు మండలానికి తలమానికంగా ఉన్నప్పటికీ చివరి ఆయకట్టు పొలాలకు నీరందకపోవడంతో రైతుల పొలాలు ఎండిపోతున్నాయి. నిమ్మపల్లి మూల వాగు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంగా నీరు ఉంటేనే 2500 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. యాసంగిలో నీరు ప్రాజెక్టు నుంచి విడుదల చేసినప్పటికీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో చివరి ఆయకట్టు రైతుల పొలాలు ఎండిపోతున్నాయి. చివరి ఆయకట్టు రైతులకు నీరు అందేలా చూడాలని నిమ్మపల్లి రైతులు కోరుతున్నారు. వరి పొట్ట దశలో నీరు ఎక్కువ తీసుకుంటుంది. ఈ సమయంలోనే భూగర్భ జలాలు అడుగంటడంతో నీరు అందక ఎండిపోతున్నాయి.

పాతాళంలో నీళ్లు..

- కాదాసు సుధాకర్, రైతు, సుద్దాల



బావుల్లో నీరు పాతాళానికి పోయాయి. వేసిన పొలాలు ఎండిపోతున్నాయి. బోరు బావులు తవ్వించినా నీరు రావడం లేదు. గతంలో ఉన్న బావుల్లో నీరు ఇంకిపోతున్నాయి. రెండు ఎకరాలు సాగు చేస్తే ఒక్క ఎకరం మాత్రమే పారుతోంది. ప్రభుత్వం సాగునీరందించి రైతులను ఆదుకోవాలి.

'ఒకే దేశం-ఒకే ఎన్నికతో' అభివృద్ధి..

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సంతోష్



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న సంతోష్



ధర్మారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం- ఒకే ఎన్నిక నిర్వహించడం వల్ల దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సంతోష్ అన్నారు. మండల కేంద్రంలో కార్యకర్తలకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఒకే దేశం- ఒకే ఎన్నిక వల్ల ఎన్నికల వ్యయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో తిరుపతి, బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, పర్శరాములు, సాయిలు, శరత్‌రెడ్డి, నరేశ్, సత్యంరెడ్డి, గణేశ్, స్వామి, కృష్ణహరి, కిరణ్‌నాయక్, గాల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రంజిత్, అంజనేయులు, బాలయ్య, సంజీవరెడ్డి, శ్రీశైలం, పూర్ణిమ, స్రవంతి పాల్గొన్నారు.

కోనరావుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఒకే దేశం-ఒకే ఎన్నిక ఉండాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రేగుల మల్లికార్జున్, మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఒకే దేశం-ఒకే ఎన్నిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగితే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అధికారంలో ఉన్న పార్టీలు ప్రజల కోసం ఆలోచిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణస్వామి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, బైరగోని సురేష్, దేవ రాజు, సురేష్ రావు, సుధాకర్, వెంకటేష్, జితేందర్‌రెడ్డి, శేఖర్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విజయోస్తు..!

(5వ పేజీ తరువాయి)

35 పరీక్ష కేంద్రాలను రెగ్యులర్ విద్యార్థుల కోసం ఒక పరీక్ష కేంద్రం ఒకసారి ఫెయిలైన విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు 461 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఇందులో 350 మంది ఇన్విజిలేటర్లు, 35 చీఫ్ సూపరింటెండెంట్‌లు, 35 డిపార్ట్‌మెంట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్స్ సెంటర్‌కు ఒకరి చొప్పున 35 మందిని నియమించారు, మరో రెండు ఫ్లయింగ్ బృందాలు, 8 మంది రూట్ ఆఫీసర్లతో పాటు పరీక్ష కేంద్రాల వద్ద ఏఎన్‌ఎంలను అత్యవసర వైద్య సేవలకు నియమించారు. ఏర్పాటుచేశారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని మౌలికసదుపాయాలు కల్పించారు. విద్యార్థులు ఎలాంటి టెన్షన్ పడకుండా సమయానికి వెళ్లడం మంచిది. విద్యార్థులు 8.30 గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. 9.35 నిమిషాల వరకు విద్యార్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30నిమిషాల వరకు పరీక్షరాసే వీలు కల్పించారు. ఫస్ట్ లాంగ్వేజ్ కంపోజిట్ కోర్సు సంబంధించి 20 నిమిషాలు అదనపు సమయాన్ని కేటాయించారు. సైన్స్ పరీక్షలు రెండు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరగనుంది. పరీక్ష కేంద్రంలోకి అరగంట ముందు నుంచి పంపిస్తారు. 9.30 తరువాత ఐదు నిమిషాల వరకు విద్యార్థులకు పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి అవకాశం కల్పించారు.

హెల్ప్‌లైన్ నంబరు ఏర్పాటు..

ఈనెల 21న మొదటి లాంగ్వేజ్ పరీక్ష తెలుగు, 22న రెండవ లాంగ్వేజ్ పరీక్ష హిందీ, 24న ఇంగ్లీష్, 26న మ్యాథ్స్, 28న సైన్స్ (ఫిజికల్‌సైన్స్) 29న సైన్స్ (బయోలాజికల్ సైన్స్), ఏప్రిల్ 2న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో హైదరాబాద్‌లో 9441440849 ఫోన్‌నంబరుతో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షలకు సంబంధించిన సందేహాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

విద్యారంగానికి నిధుల కేటాయింపు సరిపోదు..

ఇల్లంతకుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు సరిపోవని బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరంకంటే నిధుల కేటాయింపు పెరిగినా అవి కేవలం 7.57శాతానికే పరిమితం కావడం తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించడం సరైన విధానం కాదన్నారు.

ఉగాది పురస్కారానికి ఎంపిక..



చిటికెన కిరణ్‌కుమార్

సిరిసిల్ల రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణానికి చెందిన సాహితీవేత్త డాక్టర్ చిటికెన కిరణ్‌కుమార్‌కు విశ్వ వసునామ సంవత్సర ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో ఈనెల 23న తెలంగాణ మహిళ సాహిత్య సాంస్కృతిక సంస్థ పాలమూరు, ప్రమీలా శక్తిపీఠం హైదరాబాద్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది, అంతర్జాతీయ మహిళ దినోత్సవ పురస్కారాలను వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ తెలిపారు. సిరిసిల్లకు చెందిన కవి డాక్టర్ చిటికెన కిరణ్‌కుమార్‌కు ఉగాది పురస్కారం అందిస్తామని ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన ఇంటర్ పరీక్షలు

వేములవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు వేములవాడలో ప్రశాంతంగా ముగిశాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చివరి పరీక్ష గురువారం నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల వార్షిక పరీక్షలు పూర్తయ్యాయి. ద్వితీయ సంవత్సరం చివరి పరీక్ష రాసిన విద్యార్థులు ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

కొనసాగుతున్న రైతుల నిరాహార దీక్ష

ఇల్లంతకుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువ పనులు పూర్తిచేయాలని రెండు మండలాల రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష కొనసాగుతుంది. పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తిచేయాలని రైతులు చేపట్టిన నిరసనదీక్ష గురువారానికి 18వ రోజుకు చేరుకుంది. గన్నారం నర్సయ్య, అశోక్, మధు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం వర్తింపజేయాలి'

ఎల్లారెడ్డిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పేదరికమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం వర్తింపజేయాలని రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత కోసం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఈడబ్ల్యూఎస్ వారికి వర్తించే చర్యలు తీసుకోవాలని అన్నారు. కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అగ్రవర్ణాల్లోని పేదలకు చెందేలా చూడాలని వెంకట్‌రెడ్డి కోరారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి..

ఎల్లారెడ్డిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు మగ్గంపై శిక్షణ పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని నాబార్డు డీడీఎం దిలీప్‌చంద్ర అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల సమైఖ్య కార్యాలయంలో నాబార్డు సహకారంతో స్పందన సేవా సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గంపై శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో స్పందన సేవా సంస్థ ఎన్‌జీవో సీఈవో శోభారెడ్డి, ఐకేపీ ఏపీఎం మల్లేశం, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను మోసం చేసిన ప్రభుత్వం

సిరిసిల్ల టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని ఎనిమిది లక్షల మంది ఆటో డ్రైవర్లను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని గురువారం బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ ఒక ప్రకటనలో ఆరోపించారు. మూడు దఫాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మిక సంఘాల నాయకులతో చర్చించిందని తెలిపారు. ఆటోమోటర్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు సంవత్సరానికి రూ.12వేలు, రూ.5లక్షల ప్రమాదా బీమా, కొత్త ఆటో పర్మిట్లు ఇస్తామని కార్మికులతో జరిగిన చర్చలలో ప్రభుత్వం హామీనిచ్చి విస్మరించిందని పేర్కొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

ఇల్లంతకుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమారంపేట గ్రామంలో పదో తరగతి విద్యార్థులకు గురువారం శాలివాహన సంఘ మండల ఉపాధ్యక్షుడు మూడపల్లి వంశీ పరీక్షల ప్యాడ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలు రాయాలన్నారు. ఉత్తమ విద్యార్థులకు మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

శిథిలావస్థలో గ్రామ పంచాయతీ భవనం



పెచ్చులూడుతున్న పల్లిమక్త గ్రామపంచాయతీ భవనం పైకప్పు..

కోనరావుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పల్లిమక్త గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులు ఊడిపోయి కింద పడిపోవడంతో గ్రామపంచాయతీ విధులు అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామపంచాయతీ భవనం పురాతన గ్రామపంచాయతీ కావడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అధికారులు అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పల్లిమక్త గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రాను నాయక్ విగ్రహం ఏర్పాటు చేయాలి..

- లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి నరేష్‌నాయక్



నివాళులర్పిస్తున్న ఐక్య వేదిక నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు భూమి కోసం భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటాలు చేసిన రాను నాయక్ విగ్రహాన్ని ప్రభుత్వం హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి నరేష్ నాయక్ అన్నారు. లంబాడీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద రను నాయకుల వర్ధంతిని నిర్వహించారు. ముందుగా బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం రాను నాయక్ చిత్రపటానికి పూలతో నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేష్‌నాయక్ మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి అనే నినాదంతో నాడు పోరాటాలు చేసి రానునాయక్ ప్రాణాలను అర్పించారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రాను నాయక్ జయంతి వేడుకలను ప్రభుత్వం పరంగా జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో లంబాడీల ఐక్య వేదిక సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, నాయకులు నరహరి నాయక్, తిరుపతి, సాగర్, వెంకటేష్, శేఖర్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



వేములవాడలో పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిబ్బంది



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణహరి

వేములవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు వేములవాడ పట్టణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షల కోసం ఏర్పాట్లు చేశామని మండల విద్యాధికారి బి.బన్నాజీ తెలిపారు. వేములవాడ, వేములవాడ రూరల్ మండలాలకు చెందిన 1243 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వేములవాడ పట్టణంలో ప్రభుత్వ ఉన్నత, జడ్పీ బాలికల పాఠశాల, కిడ్స్ కాన్వెంట్, గౌతమ్ మోడల్, హంసిని, శ్రీచైతన్య పాఠశాలల్లో సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటిరోజుకావడంతో విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

● ఎల్లారెడ్డిపేట : పదో తరగతి పరీక్షలకు మండలంలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సెంటర్లను కేటాయించారు. గురువారం పరీక్ష కేంద్రాలను ఎంఈవో కృష్ణహరి సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. మనోహరాచారి, సోమయ్యలు చీఫ్ సూపరిండెంట్లుగా వ్యవహరించనున్నారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

● ఇల్లంతకుంట : పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గాలిపెల్లి, ఇల్లంతకుంటలో రెండు పరీక్షల కేంద్రాలు ఉండగా 447మంది విద్యార్థులు పరీక్షలకు హజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా 27మంది ఉంటారని తెలిపారు. విద్యార్థులు సరైన సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, సూచించారు. పరీక్షకేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, కేంద్రాల వద్ద ప్రజలు గుమికూడవద్దని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఇల్లంతకుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలుచేస్తున్న రాజీవ్ యువవికాస్ పథకానికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల యువకుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పథకాన్ని తీసుకవచ్చిందన్నారు. వచ్చేనెల 5వరకు దరఖా స్తు గడువు ఉందని, నిరుద్యోగులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇల్లంతకుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బాధిత కుటుంభాలను బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి పరామర్శించారు. దాచారం, ఇల్లంతకుంట, వెల్జిపూర్ తదితర గ్రామాలలో వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటంబీకులకు గురువారం ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బొల్లారం ప్రసన్న, చిట్యాల శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, రజనీకాంత్, సురేష్, కిషన్ ఉన్నారు.

సైన్స్‌ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ

చందుర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి ప్రధానోపాధ్యాయురాలు సునీత రాణి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ధర గోదావరిలు గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్పెషల్ ఆఫీసర్ నరేష్, మాజీ సర్పంచులు ఎనగంటి శంకర్, లింగంపల్లి సత్తయ్య, పూర్వ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కుసుంబ జనార్దన్, నాయకులు గసికంటి ప్రభాకర్, గడ్డం దేవయ్య, లాండే తిరుపతి, లాండే సత్తయ్య, కుసుంబ శేషాద్రి, ఏతం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన



లింగన్నపేట ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

గంభీరావుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగన్నపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ ప్రోగ్రాం జిల్లా అధికారి డి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాను టీబీ రహితంగా మార్చడమే లక్ష్యమన్నారు. అంతకు ముందు గంభీరావుపేట 1, 2, ముస్తాఫనగర్, లింగన్నపేట, నర్మాల, కొత్తపల్లి, ముచ్చర్ల సబ్ సెంటర్లలో టిబి నివారణపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వేణుగోపాల్, సీహెచ్‌వో రమేష్, టీబీ సూపర్‌వైజర్ మహిపాల్, నోడల్ సూపర్‌వైజర్ అమరావతి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

మానవత్వమే సత్యసాయి మతం..

ఎల్లారెడ్డిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మానవత్వమే సత్యసాయిబాబా మతమని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె రత్నాకర్ అన్నారు. మండలంలోని రాజన్నపేటలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీసత్యసాయి ప్రశాంతిసేవా మందిరాన్ని స్థానికులతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళకు ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టిల్లో నీటిని నింపారు. రాచర్లగొల్లపల్లిలోని ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ ఇంటికి ఆయన చేరుకున్నారు. రత్నాకర్‌ను సన్మానించారు. సంస్థ ప్రతినిధులు కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, రవీందర్, సత్యసాయి భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు ఇసుక కష్టాలు

- వారానికి ఒక్కరోజే అనుమతులు - రెండు రోజులు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి..



ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరు

సిరిసిల్ల టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సమీపాన మానేరు వాగు ఉన్నా పట్టణ వాసులకు గృహ నిర్మాణాలకు ఇసుక కష్టాలు తప్పడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమంగా జిల్లా పరిధిలోని మానేరు వాగులో నుంచి రాష్ట్ర రాజధానికి ఇసుక అక్రమ రవాణా జరిగిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, జిల్లా అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం ఆంక్షలు విధించారు. దీంతో పట్టణాలు, గ్రామాల్లో గృహనిర్మాణం చేపడుతున్న పేదలకు ఇసుక కష్టాలు మొదలయ్యాయి. వారానికి ఒకరోజు తహసీల్దార్ల నుంచి ఇంటి యజమానులు అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది. అందులో ఆ ఒక్కరోజు నాలుగు ట్రిప్పులకు మాత్రమే అధికారులు వేబిల్లుతోపాటు సమయపాలనను విధిస్తున్నారు. ఇదే అదనుగా ట్రాక్టర్ యజమానులు ఒక్కో ఇసుక ట్రిప్‌నకు రూ.2500 నుంచి 3000వేల వరకు వసూలు చేస్తున్నారు. గతంలో ఒక్కో ట్రిప్‌నకు రూ. 800 నుంచి 1200 వరకు ఉండేది. పెరిగిన ఇసుక ట్రాక్టర్ ట్రిప్ ధరలతో సామాన్యుడికి గృహ నిర్మాణం బడ్జెట్ భారం పడుతుండడంతో కొన్ని గృహనిర్మాణాలు నిలిచిపోతున్నాయి. ఒక్క ట్రిప్ ఇసుకకు ప్రభుత్వానికి వేబిల్లు రూ.500 లేబర్‌కు రూ.300 మొత్తం రూ.800 ట్రాక్టర్ యజమానికి చెల్లించడంతో ట్రిప్ ఇసుకకు గతంకంటే రెండున్నర వంతులు పెరిగాయని గృహ యజమానులు వాపోతున్నారు. కనీసం వారానికి రెండు రోజుల పాటు గృహనిర్మాణాల కోసం ఇసుకకు అధికారులు అనుమతులు ఇస్తే ట్రాక్టర్ యజమానులు ధరలను తగ్గించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం, జిల్లా అధికారులు పునరాలోచన చేయాలని పలువురు గృహ యజమానులు కోరుతున్నారు.

వారానికి రెండు రోజులు అనుమతివ్వాలి..

- బైరగోని వెంకటిగౌడ్, సిరిసిల్ల



గృహ నిర్మాణాల కోసం అధికారులు వారానికి కనీసం రెండు రోజులైన అనుమతినివ్వాలి. గతంలో వారంలో మూడు రోజులు ఇసుకకు అనుమతులిచ్చారు. స్థానిక అవసరాల కోసం ఇసుకకు అనుమతులు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి. పది హేను రోజులకు ఒక్కసారి ఇసుకకు అనుమతి ఇవ్వడం వల్లే ఇసుక ధరలు పెరగాయి. గృహ నిర్మాణం కోసం ట్రాక్టర్ ఇసుక ట్రిప్‌కు రూ. 3వేలు చెల్లించాను. పెరిగి ఇసుక ధరలతో చాలా మంది గృహ నిర్మాణాలు చేపట్టాలంటే భయపడుతున్నారు. పేదోడికి సొంత ఇళ్ళు కళ కళగానే మారింది.

నిబంధనల ప్రకారం అనుమతులు..

- ఉమారాణి, తహసీల్దార్, సిరిసిల్ల



రాష్ట్ర ప్రభుత్వ నిబంధనాల ప్రకారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సిరిసిల్లలో ఇసుకకు అనుమతులు ఇస్తున్నాం. సిరిసిల్ల ప్రాంతంలో దాదాపు 300 ఇసుక ట్రాక్టర్లు ఉన్నాయి. స్థానిక గృహ నిర్మాణాల కోసం ఇసుక ట్రాక్టర్లకు వేబిల్లులు ఇస్తున్నాం. ఒక్కో ట్రాక్టర్ నుంచి నాలుగు ట్రిప్‌ల ఇసుకకు వేబిల్లు 1920 రూపాయలు చెల్లిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా 150 ట్రాక్టర్లకు ఒకరోజు, మరో 150 ట్రాక్టర్లకు ఇంకో రోజు సాయినగర్ మానేరు వాగులో నుంచి అనుమతులు ఇస్తున్నాం.